

# అన్నంమెతుకులు

వజ్ఝల రామనరసింహమ్

హోటలులో అప్పుడే భోజనం చేసి, సమీపంగా వున్న కిల్లీదుకాణంలో శుభ్రమైన కారాకిల్లీ కొని బుగ్గని బిగించి, ఇంటివైపు నడిచి పోతున్నాను.

ఎండ నిప్పులు చెరుగు తున్నది. వేడిగాడ్పులు వీస్తున్నవి. రోడ్డుమీద అట్టే జనసంచారం లేదు. ఎంతదూరం నడిచానో నాకే తెలియదు–ఇంతలో ఏదో చప్పుడు విని, త్రుళ్లిపడి వెనుదిరిగి చూశాను...... పది, పన్నెండేళ్ల ముష్టిపిల్ల ఒకర్తె, తన చేతిలోని అన్నంగిన్నెను రోడ్డుమీద ప్రమాదవశాత్తు పడవేసి, ఏమిచేయాలో తెలియనట్లుగా దిక్కులు చూస్తూ నించుంది...అన్నం–రోజల్లా కష్టపడి సంపాదించుకున్న ఆమెఅన్నం–అంతా ఆరోడ్డు ధూళిలో, దుమ్ములో ఒలికి, చెల్లాచెదరై వుంది. అన్నంగిన్నె దొర్లుతూ వెళ్లి సైడుకాల్వలో పడింది...

లోకంలో గౌరవంగా బ్రతుకుతున్న నేను, ఈ అసహ్యకరమైన దృశ్యాన్ని మరికొంచెంసేపు చూడటానికిగాని, ఈ దృశ్యానికి ఎటువంటి ప్రాముఖ్యాన్ని ఇవ్వడానికిగాని, అవసరం వుందనుకో లేదు... ఎందుకంటే: ఒక ముష్టిది అన్నంమెతుకులను ఒంపేసుకుంది... మహా అయితే విచారిస్తూ వుంది... అంతగా అయితే, ఆనాడు తిండిలేక పస్తుంటుంది! అంతేకద! ఇదేమీ ఒక వింతకాదు. ఇటువంటి దృశ్యాలను మనవీధులలో సామాన్యంగా చూస్తూనేవుంటాము... రెండు నిమిషాలపాటు అట్లానే చూసి, "ఓస్! ఇంతేకద!" అనుకొని, వెనుతిరిగి, మళ్లీ నడక ప్రారంభించాను.

రెండు అడుగులు నడచానో లేదో, అంతరాత్మలో ఎవరో చెప్పినట్లుగా కాళ్లు టక్కున ఆగిపోయాయి; అప్రయత్నంగా వెనుతిరిగి, చూశాను. ఆ ముష్టిపిల్ల యింకా అట్లానే నుంచుని, మట్టిలో కలిసిపోయిన ఆ అమూల్యమైన అన్నంమెతుకుల వైపు చూస్తున్నది! ఆమెకళ్లు రెండూ నీళ్లతో నిండి వున్నవి... ఒక పెద్ద వేడిగాడ్పు నిప్పులతో సహా వీచింది...... ఆమె యింకా అట్లానే నుంచుని, కంఠంలోంచి వుబికి వస్తూన్న దుఃఖాన్ని ఆపుకొంటూ, ఆకలికళ్లతో, అట్లానే చూస్తూ వుంది......... 'పరికిణీ' అని పిలువబడే, చిరిగిపోయిన ఒకానొక బట్ట మొలచుట్టూ చుట్టుకొని, మరొక చింకిగుడ్డ బుజాలమీద కప్పుకొని– దీనావస్థలో–కాలిపోతూన్న ఆ రోడ్డుమీద బాధతో నుంచుని–ఒలికిపోయి నిరుపయోగమైన ఆ మెతుకులకే గుడ్లు అప్పజెప్పి వుండిపోయిన ఆమె దీనావస్థను చూస్తూవుంటే, నా మనస్సులో ఏవేవో భావాలు వుప్పెన కెరటాలవలె లేచాయి...ఈ అన్నం మెతుకులకోసమే, ఈ లోకం ప్రజలు–నేను–ఈ విశాలప్రపంచం, అంతా కష్టించి పని చేస్తున్నది. ఈ మెతుకులకోసమే, ఈ మెతుకులవల్లనే–ఈ మానవులందరూ, ఈ జగత్తంతా– ఈ రాజాధిరాజులు, చక్రవర్తులు, ధనికులు, పనివారలు, సంపాదకులు, కవులు, అందరూ జీవించివున్నారు...ఈ మెతుకులమీదనే ఈ సర్వప్రపంచం, ఈ రైళ్లు, స్టీమర్లు, యంత్రాలు, సినీమాలు, పేపర్లు, పత్రికలు, కథలు, దర్జాలు, భోగాలు, అన్నీ ఆధారపడి వున్నవి......ఏమేమో ఇంకా ఆలోచించుకొంటున్నాను. ఇంతలో మరొక పెద్ద వేడిగాడ్పు వీచింది. ఎండలో కాళ్లు కాలిపోతూన్న ఆమెకు చిరిగిపోతూన్న నా ఆవు చెప్పులను తీసియిచ్చి "ఇంద తొడుక్కో! పాపం, కాళ్ళు కాలిపోతూ

వున్నవి కావాలి!" అని అందామనుకొన్నాను. కాని- నాలోవున్న 'లోకం,' 'మర్యాద,' 'గౌరవం-' అనే శక్తు లేవేవో నా మనస్సులో విజృంభించి, "ఒద్దు! ఏమిటి చేస్తున్నావు నువ్వు? ఆ ముష్టి దానికోసమా? ఛీ, ఛీ!" అని ఘోషిస్తున్నట్లుగా వుంది. కాని—నా హృదయం మారుమూలల్లో, ఇన్నాళ్లయీ గొంతు నొక్కబడి వున్న అంతర్వాణి ఏదో, "ఔను—నువ్వు చేస్తున్నది మంచిపనే! భయపడకు" అని గొణుగుతున్నది.

నేను మెల్లిగా రెండడుగులువేసి, ఆమె దగ్గరగా వెళ్లేను...అసహ్యంగా వున్న ఆమె చేతిని నా చేత్తో అందుకుని "ఇట్లారా, హోటలువైపు! ఎందుకట్లా ఏడుస్తావే?" అందామనుకున్నాను...కాని లోకులు, ప్రజలు- స్నేహితులమనీ, బంధువులమనీ నటించే ఈ తగుమనుషులు- పెద్దలు, అందరూ "ఛా! ముష్టి దాన్ని ముట్టుకోవడ మేమిటి? నీపని నువ్వు చూసుకోక" అని హేళనతో, వెక్కిరింపుతో అంటారన్న నగ్నసత్యం తెలుసుకొని కొంచం వెనక్కితగ్గి, మెల్లిగా అన్నాను:

"గిన్నె కాల్వలో పడిపోయింది—తెచ్చుకో."

'ఎవరండి మీరు?' అన్నట్టుగా, భయంతో నావేపు చూసిందామె.

"గిన్నె తెచ్చుకో."

మెల్లిగా నడ్చుకుంటూ వెళ్లి, కాల్వలోని గిన్నెను తెచ్చి, పరికిణీతో తుడుస్తున్నది...

"నాతో రా, హోటలుకి. అన్నం పెట్టిస్తాను."

సందేహాస్పదంగా భయంతో నావేపు చూసింది.

"భయపడకు, రా! ఆకలివెయ్యటం లేదూ?"

ఇంత ఉదారత్వాన్ని, విశాల హృదయాన్ని తన జీవితంలో ఇంతవరకూ ఏ ధర్మదాతనుండిగాని చవిచూడని ఆ ముష్టిపిల్ల-నా ఆహ్వానాన్ని కేవలం ఒక పెద్ద అబద్ధంగా, నమ్మరాని విషయంగా, ఒక కలగా తీసుకుని- సుష్టిపూర్తిగా భోంచేసే అదృష్టం తనకి ఎలా కలుగుతున్నదా అని ఆశ్చర్యపోతూన్నట్టుగా నావేపు చూస్తూ, మెల్లిగా అంది:

"ఒక్క కాణీ పడేయండి బాబూ!"

మలమల మాడిపోతూవున్న ఈ భరతమాతబిడ్డ "ఒక్క కాణీ" అనే పెన్నిధితో సంతృప్తిపడటానికిసిద్ధపడుతూవుంటే, నాకళ్లల్లో నీళ్లుతిరిగినట్లయింది

"కాణీతో ఏం తింటావు? భోజనంవద్దూ?"

వణుకుతూవున్న కంఠంతో మెల్లిగా అంది:

"ఒక్క కాణీ పడేయండి బాబూ! పోతాను."

"కాణీ ఏం చేసుకుంటావ్? భోజనం పెట్టిస్తా, నాతో యిట్లారా" అని కొద్దిగా కసిరినట్లు అని, హోటలువైపు దారితీశాను. నావెనకాలే ఆమె నసుగుతూ, భయపడుతూ నడుస్తున్నది...

కొంచెం దూరం తర్వాత, సందుమలుపు తిరుగుతూ వుంటే, ఆమె టక్కున ఆగిపోయింది

"ఏం" అన్నాను నేను.

ఆమె భయంతో గజగజా వణుకుతూ అంది:

"పోతాను బాబూ!ఒక్క కాణీవుంటే పడేయండి."

"భయపడకు. హోటల్లో శుభ్రమైన భోజనం తిందువుగాని, రా."

ఆమె వింతగాచూస్తూ అంది: "హో...టే...లా? ...వద్దు బాబయ్యా...తొందరగా పోవాలి, ఒక్క కాణీ వుంటే పడేయండి..."

ఆమె అమాయకత్వాన్ని చూస్తూ వుంటే నాకు జాలేసింది...జేబులో తడిమిచూస్తే, నెలాఖరున మిగిలిన పన్నెండణాల డబ్బులూ దొరికాయి. ఓ బేడకాసుతీసి ఆమెవైపు విసిరాను. టక్కున ఆ బేడకాసు అందుకుని తుర్రున పారిపోయింది... నేను నిశ్చేష్టుడనై, రెండు నిమిషాలపాటు అట్లానే నిల్చుండిపోయి, వివిధమైన ఆలోచనలతో మళ్లీ యింటిదారి పట్టేను......

కొంచెం దూరం వెళ్లేసరికి, ఇందాకటి ముష్టిపిల్ల అన్నం వంపేసుకున్నదగ్గరకు వచ్చాను...నాకళ్లను నేనే నమ్మలేకపోయాను...ఆ ముష్టిపిల్ల రోడ్డుమీద మెతుకులను ఏరుతూ గిన్నెలో వేసుకుంటున్నది...ఆ దృశ్యాన్ని చూస్తూ, నే నట్లానే నిల్చుండిపోయాను...ఆమె నన్ను చూడలేదేమో.

ఇంతలో, ఆ రోడ్డుమీంచే, పెద్ద బొజ్జగల ఒక ధనికుడు త్రేన్చుకుంటూ వచ్చి, తన జోళ్లతో ఆ అన్నం మెతుకులను తొక్కుకుంటూ వెళ్లిపోయాడు. ఆ జోళ్లకింద నలిగిపోతూవున్న అన్నం మెతుకులను చూస్తూ వుంటే, ఈ ప్రపంచంలోని అసహాయుల ఆర్తనాదాలు ఏవేవో వినిపించాయి నాకు